

భారతీయ ధర్మం అన్ని మతాల్ని అంగీకరిస్తుందనీ, గౌరవిస్తుదనీ, అన్ని మతాలు సత్యాలేననీ, అవన్నీభగవంతుని చేరుకోడానికి మార్గాలనీ స్వామీజీ చెప్పారు. ఎవరూ మతాన్ని మార్చుకోనవసరంలేదనీ, నా మతమే గొప్పది. నా మతమే నిలవాలి అనుకునేవారు బావిలో కప్పవంటివారనీ స్వామీజీ తెలిపారు. మిగతా వక్తలు తమ తమ మతాలకే ప్రాతినిధ్యం వహిస్తే, స్వామీజీ మాత్రం అన్ని ధర్మాల తరఫునా మాట్లాడి నిజమైన మతసామరస్యాన్ని చూపారు. సదస్యులందరికి స్వామీజీ ప్రసంగమే నచ్చింది.

# 1 స్వామి వివేకానంద

©SCERT not to be republished

### బాల నరేన్

ఒక బాలుడు కలకత్తానగర వీధుల్లో నడుస్తూ వెళ్తున్నాడు. హఠాత్తుగా పెద్ద శబ్దం వినబడింది. ఏమయ్యుటుందబ్బా! చూస్తే... ఒక గుఱ్ఱపు బండి రోడ్డుపై దూసుకుపోతోంది. ఆ బండిని గుఱ్ఱం తన బలమంతా ఉపయోగించి వెఱ్ఱివేగంతో లాక్కెళుతోంది. దేన్నో చూసి అది బెదిరిపోయినట్లుంది. దాన్నుంచి దూరంగా వెళ్ళడానికేమో అన్నట్లు పరుగెడుతోంది. బండిలో పాపం ఒక మహిళ కూడా ఉంది. చాలా భయంగా చూస్తూ బండిని గట్టిగా పట్టుకుని పడిపోకుండా కూర్చుని ఉండడానికి ప్రయత్నిస్తోంది. బండి ఎప్పుడు బోల్తా పడుతుందో తెలియదు. ఎవరూ ఆవిడకి సహాయం చేయడానికి ముందుకు రావడంలేదు.

ఇదంతా ఈ బాలుడు చూశాడు. సాహసవంతుడైన అతడు బండి దగ్గరకు రాగానే ప్రాణాలకు తెగించి, పరుగెత్తి ఆ బండిలోకి ఎక్కాడు. జోరుగా పరుగెడుతున్న ఆ గుఱ్ఱపు కళ్ళెం చేజిక్కించుకొని, నైపుణ్యంతో కొద్దిసేపట్లోనే ఆ గుఱ్ఱాన్ని శాంతపరచి ఆగిపోయేటట్లు చేశాడు. ఆ మహిళ ప్రాణం నిలిచింది. అందరూ ఆ బాలుడి సాహసానికి మెచ్చుకున్నారు. ఆవిడ అతడికి ఎంతగానో కృతజ్ఞతలు తెలుపుకున్నది.

ఎవరీ అబ్బాయి? అతడి పేరు నరేంద్రనాథ్. అందరూ నరేన్ అని పిలిచేవారు. అతడే తరువాతికాలంలో విశ్వవిఖ్యాతినొంది సింహసదృశమైన మనోబలానికి ప్రతిరూపమై భారతదేశ యువజనులందరికీ ఆదర్శమై నిలిచిన శ్రీ వివేకానందస్వామి. ఈయన జన్మదినమైన జనవరి 12వ తేదీనే మన దేశ ప్రజలంతా జాతీయ యువజన దినోత్సవంగా పండుగ జరుపుకుంటారు. నరేన్ తండ్రి శ్రీ విశ్వనాథ్ దత్తా. మంచి పేరున్న వకీలు. ఎంతో చదువుకున్నవాడు. అందరి గౌరవాన్నీ పొందేవాడు. తల్లి భువనేశ్వరీదేవి. రూపంలోను, ప్రవర్తనలోను ఒక రాణివలె ఉండేది. అందరూ ఆ తల్లిని ప్రేమించేవారు, గౌరవించేవారు.

మన నరేన్ అల్లరి పిల్లవాడండోయ్! ఈ గడుగ్గాయిని పట్టుకోడం పాపం ఆ తల్లికి గగనమైపోయేది. అతన్ని చూసుకోడానికి ఇద్దరు నౌకర్లను పెట్టవలసి వచ్చింది. కానీ ఎలాగో ఒక ఉపాయం కనుక్కుంది. నరేన్ అల్లరి బాగా మితిమీరిపోయినపుడు 'శివశివా' అంటూ నెత్తిమీద చల్లనీళ్ళు పోస్తే మాత్రం అల్లరంతా క్షణంలో తగ్గిపోయి శాంతపడిపోయేవాడు. లేదా "ఏయ్, ఇలా అల్లరి చేస్తే శివుడు నిన్ను కైలాసానికి మళ్ళీ రానివ్వడు" అనగానే చల్లబడిపోయేవాడు. తన పథకాలేవీ పారనప్పుడు ఆ తల్లికి పాపం ఈ రెండే చివరి అస్త్రాలు.

బాలనరేంద్రుడు తన తల్లివద్ద ఎన్నో విషయాలు నేర్చుకునేవాడు. తల్లి భాగవత, రామాయణ మహాభారతాల్లోని కథలన్నీ చక్కగా కళ్ళకు కట్టినట్లు చెప్పేది. ముఖ్యంగా శ్రీరాముడి కథంటే నరేంద్రుడికి పంచప్రాణాలు. మట్టితో చేసిన చిన్న సీతారాముల విగ్రహాన్ని తెచ్చి రకరకాల పూలతో పూజించేవాడు. రామాయణమంటే ఎంత ప్రేమో! హనుమంతుడు అరటి తోటల్లో తిరుగుతూ రామనామ జపంచేస్తూ ఉంటాడని ఎవరో చెప్పగా విని, ఆ మహావీరుణ్ణి చూడడానికై తరచూ చాలాకాలం ఆ తోటల్లో వెతుకుతూ నిరీక్షిస్తూ గడిపేవాడు. ఆహా! ఎంత విశ్వాసం.

## పాఠశాలలో... ఆటల మైదానంలో

ఆరేళ్ల వయస్సులో నరేంద్రుడు తన విద్యాభ్యాసం మొదలుపెట్టాడు. మొదట్లో కొన్నిరోజులు పాఠశాలకు వెళ్లకుండా, తల్లిదండ్రులు నియమించిన ఉపాధ్యాయుడివద్ద ఇంట్లోనే పాఠాలు నేర్చుకునేవాడు. చదవడం, వ్రాయడం చాలా త్వరగా నేర్చేసుకున్నాడు. అతడి జ్ఞాపకశక్తి అమోఘం! ఏ పాఠమైనా గురువు ఒక్కసారి చెప్పటంతోనే నేర్చేసుకునేవాడు. మళ్ళా అప్పజెప్పగలిగేవాడు.

ఏడేళ్ళ వయస్సు వచ్చేటప్పటికి అతన్ని ఈశ్వరచంద్ర విద్యాసాగర్ స్థాపించిన మెట్రోపాలిటన్ ఇన్‌స్టిట్యూషన్‌లో చేర్పించారు. నరేంద్రుడి తెలివితేటలూ, చురుకుదనం, ఎప్పుడూ చిరునవ్వు చిందించే ముఖం, అన్నిటా ఎంతో ఉత్సాహంగా పాల్గొనే స్వభావంవల్ల అనతికాలంలోనే తోటిబాలురందరికీ నాయకుడయిపోయాడు. ఆటలంటే ప్రాణం. అందరికంటే ముందే మధ్యాహ్నం టిఫిన్ బాక్సుని ఖాళీచేసేసి ఆటల మైదానంలోకి పరుగెత్తేవాడు. పరుగులు తీయడం, కుస్తీపట్టడం, బాక్సింగు, గోళీఆటలు, కప్పగెంతులూ ఒకటేమిటి, ఉన్న ఆటలన్నీ ఆడేసేవాడు. కొత్తకొత్త ఆటలు కూడా కనిపెట్టేవాడు. రోజుకో లాగు చినిగిపోయేది. రెండురోజులకొక కొత్త దెబ్బ తగిలేది. బాధ తల్లికేగానీ, బాలుడు మాత్రం మళ్ళీ చిచ్చరపిడుగే.

ఒక్కోసారి తరగతి గదిలో ఉపాధ్యాయుడుండగానే ఇతర బాలురతో ముచ్చట్లు చెప్పడం, వారిని నవ్వించడం వంటివి చేసేవాడు. ఒకరోజు నరేంద్రుడూ ఇతర స్నేహితులూ మాట్లాడుకుంటూ ఉండడం చూసి వాళ్ళని మాస్టారు అప్పటిపాఠం అప్పజెప్పమన్నారు. ఒక్క నరేంద్రుడు తప్ప ఇంకెవరూ ఆ పాఠం అప్పజెప్పలేకపోయారు. పాఠాన్ని ముందే చదివిన నరేన్ అన్ని ప్రశ్నలకీ సరైన సమాధానాలు చెప్పారు. మాస్టారుగారు ఎవరు మాట్లాడారని మళ్ళీ అడిగారు. అందరూ నరేన్‌వైపు వేలుచూపారు. అది నమ్మలేక, అంతా అబద్ధం చెప్పారని తలచి నరేన్ తప్ప అందరినీ బల్లలెక్కి నుంచోమన్నారు. వారితోపాటు నరేంద్రుడు కూడా నుంచున్నాడు. ఆశ్చర్యంగా మాస్టారు 'నువ్వెందుకు నుంచున్నావని' అడగ్గా "ఊం నేనే నుంచోవాలి. ఎందుకంటే వీళ్ళతో మాట్లాడుతున్నవాణ్ణి నేను" అని సమాధానమిచ్చాడు.

©SCERT not to be republished

నరేంద్రునికి ఇష్టమైన ఇంకొక ఆట రాజు– దర్బారు. ఎప్పుడూ అతడే రాజు. విశాలమైన తమ ఇంట్లోని వసారా నుండి పూజగదికి దారితీసే మెట్లే రాజసభాప్రాంగణం. అన్నిటికంటే పైమెట్టుపై నరులకి ఇంద్రుడైన నరేంద్ర మహారాజుగారు ఆసీనులై ఉంటారు.

తాను ఆడే ఎన్నో ఆటల్లో వంటచేయడం కూడా ఒకటి. కూరగాయలు, మసాలాదినుసులు కొన్ని రకాల వంటకాలు తయారుచేసేవాడు. నిజానికి అతడు మంచి రుచికరమైన వంటలు చేయగలిగేవాడు. అలాగే స్నేహితులందరినీ కూడబెట్టి ఒక చిన్న నాటక బృందాన్ని తయారుచేశాడు. తర్వాత శరీరదార్ఢ్యం పెంపొందించుకోడంమీద అతనికి మక్కువపెరిగి, తన ఇంటిలోని ఖాళీ ప్రదేశంలో స్వంతంగా ఒక వ్యాయామశాల వంటిది ఏర్పరిచాడు. కొంతకాలానికి బయట ఒక పెద్ద వ్యాయామశాలలో చేరాడు. కర్రసాము, కత్తిసాము, గుర్రపుస్వారీ, ఈత,కుస్తీ మొదలైన ఆటల్లో నిపుణులవద్ద తర్ఫీదు తీసుకున్నాడు.

### యువ నరేన్

మన కథానాయకుడు పెద్దవాడవుతున్నకొద్దీ పుస్తకాలు చదవడంలో నిమగ్నమై ఆటలు ఆడడంపై మొగ్గుచూపించడం తగ్గించేశాడు. బడిలో బాగా చదువుతూ ఉండేవాడు. కానీ వాళ్ళ నాన్నగారు కలకత్తా నుంచి రాయ్‌పూర్‌కి బదిలీ అవడంవల్ల రెండేళ్ళు చదువు ఆగిపోయింది. మళ్ళీ తిరిగి బడిలో చేరేసరికి మూడేళ్ళ చదువు ఒక్క సంవత్సరంలో పూర్తిచేయవలసి వచ్చింది. పరీక్షలు దగ్గరపడుతూ ఉంటే నరేన్ శ్రద్ధగా ఎక్కువసేపు కష్టపడీ, ఇష్టపడీ చదివేవాడు. చివరికి పరీక్షలో మొదటిశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ సంవత్సరంలో తన పాఠశాల నుండి ఆ శ్రేణిలో పాసైన ఏకైక విద్యార్థి అతడే (ఆ రోజుల్లో అదే గొప్ప) తర్వాత ఒక సంవత్సరం ప్రెసిడెన్సీ కాలేజీలోను, మరుసటి సంవత్సరం ఇప్పుడు స్కాటిష్ చర్చ్ కాలేజి అని పిలువబడే కళాశాలలోనూ చేరాడు. ఈ కళాశాలలోని ఆచార్యులంతా యువనరేంద్రుడి ప్రతిభాపాటవాల్ని, ఆసక్తినీ, ధారణాశక్తినీ చూసి ఆశ్చర్యచకితులయ్యారు. దాదాపు పాతికేళ్ళ తన అనుభవంలో ఈ దేశంలోకానీ, పరాయిదేశాల్లో కాని ఇంతటి ప్రతిభని తానెక్కడా చూడలేదని ప్రిన్సిపల్ డబ్ల్యు డబ్ల్యూ హేస్టీ అనేవారు.

నరేంద్రుడు అన్నిరకాల అంశాలపై ఎన్నెన్నో గ్రంథాలు చదివేవాడు. అతడు విద్యను ఆర్జించే ఒక నిజమైన విద్యార్థి. జ్ఞానసముపార్జనే అతడి లక్ష్యంకానీ, ఇతరులకన్నా ఎక్కువ చదివేయాలి. అందుకే అంత చదివినా కష్టమనిపించేది కాదు. పైగా ఆ చదువు ఎంతో తృప్తినీ, ఆనందాన్నీ ఇచ్చేది. 1884లో బి.ఏ. పట్టా కూడా పొందాడు. నలుగురితోను ఉన్నప్పుడు శాస్త్రచర్చలు జరపడంలో మక్కువ చూపేవాడు. ఒక్కోసారి పెద్దవారితోను తాత్విక చర్చలు చేసేవాడు. అతడి మేధాసంపత్తి, తర్కించగల శక్తి ముందు ఎవరూ నిలువగలిగేవారు కాదు.

ఈ సమయంలో నరేంద్రుడికి ఆధ్యాత్మికపరమైన, మతపరమైన సమస్యల మీదికి మనస్సుపోయింది. ఆ సమయంలో కలకత్తా మహానగరం దేశరాజధాని. అక్కడి యువకులందరిలాగే నరేంద్రుడు కూడా బ్రహ్మసమాజమనే ఆధ్యాత్మిక సంస్థలో చేరి కేశవ్‌చంద్రసేన్ మొదలయిన ప్రముఖుల ప్రసంగాలు వినడం, పాటలు పాడడం వంటివి చేసేవాడు.

### శ్రీరామకృష్ణులను కలవడం

ఆధ్యాత్మికత అంటే నరేంద్రుడికి ఇష్టం. మతం బోధించే చాలా విషయాలలో అతడికి నమ్మకంపోయింది.

ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో స్పష్టంగా తెలియటంలేదు. ఎంతోమంది మతపెద్దలనే వాళ్ళవద్దకి పోయినా ఏమీ ప్రయోజనం లేదు. చివరికి ఇద్దరు ముగ్గురు శ్రేయోభిలాషులు చెప్పగా పరమహంస అని అందరూ కీర్తించే శ్రీరామకృష్ణుల వద్దకు వెళదామని నిశ్చయించుకున్నాడు. శ్రీరామకృష్ణుల స్వంతగ్రామం కామార్పుకూరు. ఆయన ఆ సమయంలో కలకత్తా నగరానికి ఉత్తరంగా ఉన్న దక్షిణేశ్వర కాళికాలయంలో నివసిస్తూ ఉండేవారు. ఆయన జీవితమంతా జప, ధ్యాన, భక్తి, యోగ సాధనలమయం. ఎంతోమంది వారివద్దకు వచ్చేవారు. ఆయన వారికి శాంతిని ప్రసాదించేవారు.

శ్రీరామకృష్ణులను కలిస్తే తనకు సమాధానం దొరుకుతుందేమోననే ఆశతో నరేంద్రుడు ఇద్దరు ముగ్గురు స్నేహితులతో కలిసి ఆయన వద్దకు వెళ్ళాడు. తన సంశయాన్ని ప్రశ్నరూపంలో “అయ్యా! తమరు భగవంతుణ్ణి చూశారా?” అని సూటిగా అడిగాడు. వెంటనే అంతే సూటిగా ఏ తడబాటు లేకుండా “ఓ చూశాను. నిన్నిప్పుడు ఎంత స్పష్టంగా చూస్తున్నానో అంతకంటే స్పష్టంగా చూశాను. కావాలంటే నీకు కూడా చూపించగలను. కానీ నాయనా! భగవంతుడు కావాలని ఎవరు ఆరాటపడతారు? భార్యా పిల్లలకోసం, ధన సంపాదనకోసం కడవలకొద్దీ కన్నీరు కారుస్తారు. భగవంతుడికోసం ఎవరు విలపిస్తారు? ఎవరైనాసరే భగవంతుడికోసం తీవ్రవ్యాకులతతో విలపిస్తే ఆయన వారికి తప్పకదర్శనమిస్తాడు. ఇది నిజం. నా అనుభవం” అని గుండెపై చేయివేసుకొని శ్రీరామకృష్ణులు సమాధానమిచ్చారు. నరేంద్రుడికి కొంతసేపు నోటమాటరాలేదు.

“నేను భగవంతుణ్ణి చూశాను” అని ధైర్యంగా చెప్పగలిగిన ధీరుణ్ణి మొదటిసారి చూశాడతను.

ఒక నెలరోజుల తర్వాత, ఒంటరిగా మళ్ళీ దక్షిణేశ్వరానికి వచ్చాడు నరేన్. పరమానందంతో శ్రీరామకృష్ణులు అతడిని తమ పక్కన కూర్చోబెట్టుకుని అతణ్ణి స్పృశించారు. అంతే! శ్రీరామకృష్ణులు గొప్ప ఆధ్యాత్మిక శక్తి సంపన్నులని నరేంద్రుడికి ఆ స్పర్శ తెల్పింది.

**గురుశిష్యులు**

నరేంద్రుడు శ్రీరామకృష్ణుల వద్దకి తరచూ వెళ్ళడం ప్రారంభించాడు. శ్రీరామకృష్ణులు మహాశక్తి సంపన్నులే కాదు ఆయన జీవితం పవిత్రతకి ప్రతిరూపమని గ్రహించాడు. ఆయన ఏమి ఆలోచించేవారో అదే చెప్పేవారనీ, ఏం చెప్పేవారో అదే చేసేవారని పరీక్షించి తెలుసుకున్నారు. వీటన్నిటికీ మించి తనను తన తల్లిదండ్రులకంటే కూడా ఎక్కువగా ప్రేమించే వ్యక్తి శ్రీరామకృష్ణులని తెలుసుకొని



**రామకృష్ణ పరమహంస, స్వామివివేకనంద**
**ధ్యాన ముద్రలో ఉన్న గురుశిష్యులు**

© SCERT not to be republished

ఆయన ప్రేమానురాగ శిక్షణలను మహాప్రసాదంగా స్వీకరించాడు. అలా సమయం నడుస్తోంది. 1884వ సంవత్సరం మొదట్లో నరేంద్రుని తండ్రి మరణించాడు.

**కాశీపూర్‌లో**

తండ్రి మరణంతో నరేంద్రుడి జీవితం తెగిన గాలిపటమైంది. మనశ్శాంతి ఎక్కడైనా దొరుకుతుందంటే అది శ్రీరామకృష్ణులవారి పాదపద్మాల చెంత మాత్రమే. 1885లో శ్రీరామకృష్ణులవారి గొంతులో ఒక వ్రణం కనిపించింది. అది క్యాన్సరు వ్యాధి అని వైద్యులు నిర్ణయించారు. శిష్యులంతా కలిసి గురువుగారికి సేవచేయడం మొదలుపెట్టారు.

ఎక్కువ కాలం గురుసేవలో గడిపిన శిష్యుల్లో నరేంద్రుడొకరు. అప్పుడప్పుడూ కుటుంబానికి కావలసిన చిన్న చిన్న పనులుచేయడానికి బయటకు వెళ్ళినా, ఎక్కువకాలం కాశీపూర్‌లోనే గురువుకి సపర్యలు చేస్తూ గడిపేవాడు. ఎప్పటిలాగే శిష్యుల్లో నరేంద్రుడే నాయకుడు.

శ్రీరామకృష్ణులు నరేంద్రుడిని భవిష్యత్తులో అతడు సాధించవలసిన మహత్కార్యాలకోసం సమాయత్తపరుస్తున్నారు. ఇతర శిష్యుల భౌతిక ఆధ్యాత్మిక ప్రగతి బాధ్యతని నరేంద్రుడికి అప్పగించారు శ్రీరామకృష్ణులు. యోగ్యులైన శిష్యులందరికీ కాషాయవస్త్రాలు ప్రసాదించి సన్యాసులను చేశారు. తర్వాత వారిని భిక్షాటనకి పంపించారు. అలా అందరూ తెచ్చి సమర్పించిన ఆహారాన్ని ఆనందంగా భుజించి అటువంటి ఆహారం అతి పవిత్రమైనదని చెప్పారు. ఆ తర్వాత నరేన్ సన్యాసాన్ని స్వీకరించి స్వామీజీగా మారారు.

**దేశ పర్యటన**

స్వామీజీ (నరేన్ / నరేంద్రుడు) బారానగర్ మఠంలో రెండేళ్ళు నివసించారు. హిందూ సన్యాసుల సంప్రదాయం ప్రకారం ఇతర సోదర సన్యాసులు కొంతమంది మఠాన్ని వదిలి దేశంలోని తీర్థయాత్రలకని ఒక్కొక్కరుగా బయల్దేరారు. స్వామీజీ ఇక ఉండలేక, 1888లో కాశీకి ప్రయాణమయ్యారు.

కాశీలో ఒక సంఘటన జరిగింది. ఒకరోజు దుర్గా అమ్మవారి ఆలయానికి వెళ్ళి వస్తూంటే దారిలో ఒక కోతులగుంపు కనిపించింది. అవి ఆయనవైపు తిరిగి పరుగెత్తిరాసాగాయి. అవి కరుస్తాయనే తలంపుతో స్వామీజీ వెనుదిరిగి చిన్నగా పరుగెత్తనారంభించారు. అవి ఇంకా వెంబడిస్తూనే ఉన్నాయి. ఏంచేయాలా అని ఆలోచిస్తూ పరుగెడుతున్న స్వామికి అటుగా వెళ్తున్న ఒక వృద్ధ సన్యాసి కనిపించాడు. అడగకుండానే ఆ సన్యాసి అంతా గమనించి "ఆగు! వెనుదిరిగి ఆ జంతువుల నెదుర్కో" అని గట్టిగా అరిచాడు. స్వామీజీ ఆగి వెనక్కి తిరగగానే కోతులు కూడా ఆగి వెనుదిరిగాయి. స్వామీజీ రెండు మూడడుగులు వేసి భయపెట్టగానే అవి పరుగులంకించుకున్నాయి. తరువాతికాలంలో స్వామీజీ అమెరికాలో ప్రసంగిస్తూ ఇది తన జీవితంలో తాను నేర్చుకున్న ఒక గొప్ప పాఠం అనీ, ఆ కోతుల్లాగ కష్టాలు మనల్ని వెన్నాడతాయనీ, ఎప్పుడైతే ఆగి మనం వెనుదిరిగి వాటినెదుర్కొంటామో అప్పుడు అవే పారిపోతాయని బోధించారు.

1890లో మళ్ళీ యాత్రలకి బయల్దేరి ఎన్నో ఏళ్ళదాకా వెనక్కి రాలేదు. ఒక సోదర సన్యాసితో కాశీ లోనూ హిమాలయ ప్రాంతాలలోను తిరిగారు. ఈ పర్యటనలలో స్వామీజీకి ఎన్నో అనుభవాలు ఎదురైనాయి. కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి. చాలాసార్లు ఆయనకి ఎన్నో రోజులు తినడానికి ఏమీ ఉండేది కాదు. చాలా రాత్రులు ఆయనకి ఆకలీ బడలికలే స్నేహితులుగా ఉండేవి.

అప్పుడొక అద్భుతం జరిగింది. మిఠాయికొట్టు యజమాని అయిన ఒక వ్యక్తి వెతుక్కుంటూ వచ్చి స్వామీజీ పాదాలపై వాలి, వెంట తెచ్చిన భోజనం పొట్లాన్ని చూపిస్తూ స్వీకరించమని ప్రాధేయపడ్డాడు. స్వామీజీ "ఎవరు నాయనా నీవు? నేను నిన్నెఱుగనే! పొరబడుతున్నట్లున్నావు. నీవు వెతుకుతున్న వ్యక్తిని నేను కాను" అని అంటూ ఉంటే, ఆ వ్యక్తి స్వామీజీ ముందు చిన్నపీటవేసి భోజనం ఒక ఆకు మీదికి మారుస్తూ "లేదు స్వామీ, నేను కలలో చూసింది మిమ్మల్నే. శ్రీరామచంద్రమూర్తి స్వయంగా నా కలలో కనిపించి మిమ్మల్ని చూపించి, నా బిడ్డ ఆకలితో ఉంటే నువ్వు హాయిగా తిని నిద్రిస్తున్నావా? లే, లేచి అతడికి భోజనం పెట్టు' వెళ్ళమని ఆజ్ఞాపించాడండీ. ఆహా! ఏమి నా భాగ్యం! మీవల్లనే నాకు రామదర్శనం కలిగింది. తండ్రీ బిడ్డలిరువురిదీ ఏమి గాంభీర్యం! ఏమి సౌందర్యం! ఒక్కసారి చూస్తే చాలు, ఎవరూ మరిచిపోలేరు. నేను పొరబడటంలేదు స్వామీ. దయచేసి వేడి చల్లారకముందే ఆరగించండి. చల్లని నీళ్ళు కూడా తెచ్చాను" అన్నాడు. స్వామీజీ కనుల వెంబడి జలజలా నీరుకారింది. ఏ అభయహస్తమైతే తన జీవితమంతా ఆయన్ను కాపాడుతూ వస్తోందో, అదే అభయహస్తమిది. ఎదురుగా నోరు వెళ్ళబెట్టి ఇదంతా చూస్తున్న వడ్డీ వ్యాపారికి సన్యాస జీవితమంటే భగవంతుడి ఒడిలో వసించడమని అర్థమైంది. అశ్రునయనాలతో లేచివచ్చి స్వామికి సాగిలపడి నమస్కరించాడు. ఇలాంటి ఘటనలు స్వామీజీ జీవితంలో ఎన్నో జరిగాయి.

స్వామీజీ ఎన్నోసార్లు తనకోసం తాను కొన్ని నియమాలు పెట్టుకునేవారు. ఎవరైనా పిలిచి ఆపితే తప్ప ఆగకుండా యాత్ర సాగిస్తూనే ఉండాలనీ, ఎవరైనా పిలిచి భిక్ష ఇస్తే తప్ప ఆహారం తీసుకోకూడదనీ ఇలాంటి కఠిన నియమాలెన్నో పాటించేవారు. స్వామీజీ వద్ద ఒక చిన్న భగవద్గీత; 'ది ఇమిటేషన్ ఆఫ్ క్రైస్ట్' అనే గ్రంథాలు తప్ప ఇంకేవీ ఉండేవి కావు.

ఇలా పర్యటిస్తూనే తమిళనాడులోని కన్యాకుమారికి చేరుకొన్నాడు. మూడు సముద్రాలు కలిసే కన్యాకుమారిలో అమ్మవారి ఆలయం సందర్శించి వచ్చి సముద్రంలో అల్లంత దూరంలో కనిపిస్తూన్న ఒక పెద్ద శిలని చూశారు స్వామీజీ. ఆ శిలదాకా పడవలో వెళ్ళడానికి స్వామీజీ దగ్గర డబ్బులు లేవు. ఎవరు నా మాతృభూమిని అంధకారంనుంచి మేల్కొలుపుతారు? ఈ దేశ ప్రజల అలసత్వాన్నీ అజ్ఞానాన్నీ పటాపంచలుచేసి మళ్ళీ దానికి తన పూర్వవైభవాన్నీ తీసుకురావడం ఎలా? ఇన్ని ప్రశ్నలు, ఇంత ఆవేదనా మనస్సులో ఉవ్వెత్తున లేచి చేసే అల్లకల్లోలం ముందు, ఎదుట ఉన్న మూడుసముద్రాల అలలజోరు లెక్కలోకి రానిదై స్వామీజీ ఆ సాగరాన్ని ఈది శిలను చేరుకున్నారు.

**అమెరికా**

అమెరికా దేశంలో సకల మతాల మహాసభ ఒకటి జరగబోతున్నదని అంతకుముందు ఎక్కడో విన్నారు స్వామీజీ. ఆ సభలో పాల్గొని భారతదేశపు ధర్మాన్ని ప్రపంచానికి సరైన విధంగా తెలియజేయడానికి నిశ్చయించుకున్నారు స్వామీజీ.

స్వామీజీ మద్రాసుకు వెళ్ళారు. అక్కడ కొంతమంది యువకులు ఆయన ప్రణాళిక విని సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఖేత్రీ మహారాజు ఈ సమయంలో స్వామివారిని ఆహ్వానించి వారి ఆలోచన విని, కెనడాకి వెళ్ళే ఒక ఓడలో ప్రథమశ్రేణి టిక్కెట్టుకొని ఇచ్చారు. ఆయన స్వామీజీకి మంచి కాషాయవస్త్రాలు బహూకరించి 'వివేకానంద' అనే నామధేయాన్ని స్వీకరించవలసిందిగా ప్రార్థించారు. స్వామీజీ ఈ విధంగా వివేకానందస్వామి అయ్యారు.

వివేకానందస్వామి బొంబాయి నుండి 1893 మే 31వ తారీఖున అమెరికాకి బయలుదేరారు. ఓడ దారిలో సిలోను, సింగపూరు, హాంగ్‌కాంగ్, చైనా, జపాన్‌లలోని రేవులలో ఆగింది. స్వామీజీ ఆయా ప్రాంతాలను ఎంతో ఆసక్తితో గమనించేవారు. కొన్నాళ్ళకి ఓడ కెనడా దేశంలోని వాంకోవర్‌లో ఆగింది. స్వామీజీ అక్కడి నుండి షికాగోకి రైలులో వెళ్ళారు. రైల్లో సాన్‌బోర్న్ అనే ఒక మహిళ స్వామీజీతో మాట్లాడింది. స్వామీజీ ప్రతిభాపాండిత్యాలనీ, పవిత్రతనీ గమనించి 'స్వామీ మీరెపుడైనా బోస్టన్ నగరానికి వస్తే, దయచేసి మా ఇంటికి అతిథిగా వచ్చి మమ్మానందింపజేయండి' అని తన చిరునామా ఇచ్చింది. జూలై నెల మధ్యలో స్వామీజీ షికాగో చేరుకున్నారు. అదొక చిత్రమైన కొత్త ప్రపంచం. అక్కడి భవంతులు, రోడ్లు, సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలూ, యంత్రాలూ, కర్మాగారపు తయారీలూ, కళలూ మొదలైనవన్నీ చూసి స్వామీజీ విస్తుపోయారు.

కొన్నిరోజుల తర్వాత స్వామీజీకి కొన్ని విషయాలు తెలిసాయి. ఏ విశ్వమత మహాసభలకై ఆయన వచ్చారో అవి సెప్టెంబర్ మాసం మధ్యలోగాని మొదలవవు, అనీ అంతేగాక తనవద్ద కావలసిన ధ్రువపత్రాలేవీ లేనందువల్ల ఆయన వాటిలో వక్తగా పాల్గొనడం కుదరదనీ, పత్రాలు ఒకవేళ ఉన్నా వక్తలనంగీకరించే సమయం మించిపోయిందనీ తెలుసుకున్నారు. ఇంకొక సమస్యేమిటంటే షికాగో ధనవంతుల నగరం. అక్కడి ధరలకూ తనదగ్గర ఉన్న కొద్దిపాటి డబ్బుకూ పొంతనే లేదని, ఇంకొన్నాళ్ళలో డబ్బులన్నీ ఖర్చయిపోయి పస్తులుండవలసిందేననీ అర్థమైంది.

బోస్టన్ వంటి చోటైతే తక్కువ ఖర్చుతో జీవించవచ్చని ఎవరో చెప్పగా, సాన్‌బోర్న్ ఆహ్వానం కూడా గుర్తుకు వచ్చి ఆ పట్టణానికి ప్రయాణమయ్యారు. ఆవిడ ఇంట్లో ఉండగానే హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసరయిన జె.హెచ్.రైట్ అనే వ్యక్తితో పరిచయమైంది స్వామీజీకి. శాస్త్రీయమైన, తాత్త్వికమైన విషయాలెన్నో చర్చించుకున్నారు వారు. ప్రొఫెసర్‌గారు స్వామీజీ పాండిత్యాన్ని చూసి జరగబోయే విశ్వమత మహాసభల్లో హైందవ ధర్మానికి ప్రాతినిధ్యం వహించవలసిందిగా ఆయనను కోరారు. స్వామీజీ తాను వచ్చింది అందుకనేననీ, కానీ తన వెంట ఏ ధ్రువపత్రాలూ లేవనీ, అందువలన సభల్లో పాల్గొనడం కుదరదని విన్నాననీ తెలిపారు. అది విని విస్తుబోయిన ఆ అమెరికా పండితుడు "స్వామీ! మిమ్మల్ని ధ్రువపత్రాలడగడమంటే, సూర్యుడికి ప్రకాశించే హక్కు ఎవరిచ్చారని అడగడమే" అని జవాబిచ్చారు.

అంతేకాక, షికాగో విశ్వమత మహాసభల అధ్యక్షుడికి ఒక ధ్రువపత్రం వ్రాస్తూ ప్రొఫెసర్‌గారు "ఈ వ్యక్తి మేధస్సూ, పాండిత్యం మన దేశంలోని గొప్ప గొప్ప పండితులందరి పాండిత్యాన్నీ కలిపితే వచ్చే పాండిత్యం కన్నా గొప్పది" అని పరిచయం చేశారు. షికాగో వరకు ఒక టిక్కెట్టు కూడా కొనిఇచ్చారు ప్రొఫెసర్‌గారు. దైవసంకల్పం ఎంత బలమైందో చూసి స్వామీజీ ఆనందించారు.

షికాగో చేరి చూసుకునేసరికి ఆ కమిటీ చిరునామా ఎక్కడో పడిపోయిందని అర్థమైంది స్వామీజీకి. అంత మహానగరంలో ఇప్పుడెక్కడికి పోవాలి? అప్పటికే చాలా అలసటగా ఉండి, మరోచోటు దొరక్క కనిపించిన ఒక పెద్ద ఖాళీ డబ్బాలో రాత్రి గడిపారు. పొద్దునే లేచి ఒక వీధిలో నడుస్తూ తన సన్యాస సంప్రదాయం ప్రకారం ఆహారంకోసం యాచించారు. అక్కడి ఇళ్లు చాలా పెద్దవి, ధనవంతులవి. కానీ అందరూ ఆయన్ని ఛీకొట్టారు. పనివారు కూడా అవమానించారు. పాశ్చాత్యంలో భిక్షాటన చేయడం గర్హనీయం కదా. ఇక ఏం చేయాలి? భగవంతుడే కనుక నన్నిక్కడికి తీసుకువస్తే ఆయనే నాకేదో దారి చూపిస్తాడులే అనుకొని ఒక చెట్టుకింద

కూర్చున్నారు. అప్పుడే ఒక ఇంటి తలుపు తెరుచుకొని, ఒక మహిళ సూటిగా స్వామీజీ వద్దకు వచ్చింది. "మీరు విశ్వమత మహాసభలకి వచ్చినవారా? చూస్తే భారతీయ సన్యాసిలా ఉన్నారు!" అని అడిగింది. స్వామీజీ కథ విని ఇంటికి ఆహ్వానించి ఎంతో గౌరవంతో చూసుకుంది ఆ తల్లి. ఆవిడ పేరు జార్జ్ డబ్ల్యూ.హేల్. తర్వాత ఆ కుటుంబమంతా స్వామీజీకి జీవితాంతం మంచి స్నేహితులుగా మిగిలిపోయారు.

1893వ సంవత్సరం, సెప్టెంబర్ 11వ తేదీ సోమవారంనాడు విశ్వమత మహాసభలు మొదలైనాయి. కొలంబస్ హాల్ అనే ఒక పెద్ద భవనంలో అవి జరిగాయి. వివేకానంద స్వామి ఇతర వక్తలతోపాటు వేదికపై ముందు వరసలో కూర్చున్నారు. రోమన్ క్యాథలిక్కు చర్చికి చెందిన కార్డినల్ గిబన్స్ మధ్యలో కూర్చున్నారు. రెండుపక్కలా దాదాపు అన్ని దేశాల, అన్ని మతాల ప్రతినిధులంతా కూర్చున్నారు. భారతదేశం నుంచీ ఇంకొంతమంది కూడా ఉన్నారు. బ్రహ్మసమాజానికి మజుందార్, నాగార్కర్ అనేవారు ప్రతినిధులు, సిలోను బౌద్ధధర్మానికి ధర్మపాలా, థియోసఫీకి శ్రీమతి బిసెంట్ చక్రవర్తి ప్రతినిధులు. శ్రోతలు దాదాపు నాలుగువేలమంది.



షికాగో విశ్వమత మహాసభల్లో స్వామివివేకనంద

స్వామీజీకి అంతమంది ముందు మాట్లాడాలంటే కొంత బెరుకు కలిగింది. అందరూ పుటలకొద్దీ వ్రాసుకుని చదివేస్తున్నారు. మరి స్వామీజీ మాత్రం అటువంటి ఏ సన్నాహాలు లేకనే వచ్చేశారు. సభాధ్యక్షుడు రెండుమూడుసార్లు మాట్లాడమంటే ఇప్పుడు కాదు తర్వాత అని తోసిపుచ్చారు. సాయంత్రం ఇక అడక్కుండానే స్వామివారి పేరుని పిలిచేసరికి లేచారు. సరస్వతీదేవిని తలచుకొని, శ్రావ్యమైన ఆయన కంఠంతోను, అంతకంటే మధురమూ, పరమపవిత్రమూ అయిన ఆయన హృదయాంతరాళాలలో నుంచీ వచ్చిన విశ్వమానవ సౌభ్రాత్ర భావనతోను "నా అమెరికా దేశ సోదర సోదరీమణులారా...." అని మొదలుపెట్టాడు. దాంతో ఆ జనసముద్రమంతా ఒక్కసారిగా లేచి నుంచొని కమ్మని ఆ పిలుపుకీ, ఇంద్రియగ్రహణము కాకపోయినా తమముందు... మూర్తీభవించిన ఆ పవిత్రతకూ, ఏ నాగరికత పరిపూర్ణతకైనా చిహ్నమైన ఆ సన్యాస స్ఫూర్తికీ తమకు తెలియకనే పులకించిపోయి కరతాళధ్వనుల వర్షం కురిపించారు. ఉపన్యాసపు ఆరంభంలోనే అందిన ఆ అపూర్వ అభినందన మూడు నిమిషాలపాటు సాగింది. మధ్యలో స్వామివారు మళ్ళీ మాట్లాడడానికి చేసిన రెండు మూడు ప్రయత్నాలు విఫలమే అయ్యాయి.

అందరూ కూర్చున్నాక స్వామీజీ కొనసాగించారు. భారతీయ ధర్మం అన్ని మతాల్ని అంగీకరిస్తుందనీ, గౌరవిస్తుదనీ, అన్నీ మతాలు సత్యాలేనని, మతాలన్నీ భగవంతుని చేరుకోడానికి మార్గాలని స్వామీజీ చెప్పారు. ఎవరూ మతాన్ని మార్చుకోనవసరంలేదనీ, నా మతమే గొప్పది. నా మతమే నిలవాలి అనుకునేవారు బావిలో

©SCERT not to be republished

కప్పవంటి వారనీ స్వామీజీ తెలిపారు. మిగతా వక్తలు తమ తమ మతాలకే ప్రాతినిధ్యం వహిస్తే, స్వామీజీ మాత్రం అన్ని ధర్మాల తరఫునా మాట్లాడి నిజమైన మతసామరస్యాన్ని చూపారు. సభ్యులందరికీ స్వామీజీ ప్రసంగమే నచ్చింది. రాత్రికి రాత్రి స్వామీజీ ఖ్యాతి దేశమంతటా వ్యాపించింది. పత్రికలన్నీ స్వామీజీని వేనోళ్ళ పొగిడాయి.

భారతదేశపు వార్తాపత్రికలు కూడా ఈ వార్తని బాగా ప్రచురించాయి. ప్రజలంతా వివేకానందుణ్ణి చూసి చాలా గర్వించారు. బాలానగర్ మఠంలోని సన్యాసులంతా తమ నరేంద్రుడే ఈ 'వివేకానందస్వామి' అని తెలుసుకుని అమితానందం పొందారు.

షికాగో నగరంలోని ప్రముఖులూ, ధనవంతులూ స్వామీజీకి ఆతిథ్యం ఇవ్వడంకోసం పోటీపడేవారు. వారి ఇంట్లో పరిచారకులు ఆయనకు వడ్డించడంకోసం నేనంటే నేనని కొట్లాడుకునేవారు. రాత్రి పడుకోవడానికి స్వామీజీకి ఇచ్చిన గది ఇంద్రభవనంలా ఉంది. హంసతూలికా తల్పం ఎదురుచూస్తున్నది. ఇవన్నీ చూసిన స్వామీజీ గుండెను ఎవరో రంపంతో కోసినట్లయింది. అయ్యో! నా భారతదేశ ప్రజల్లో అధికభాగం తినడానికి తిండిలేక, కట్టుకోడానికి బట్టలేక అలమటిస్తూంటే ఇక్కడ వీళ్ళు డబ్బుల్ని నీళ్ళలా ఖర్చుపెడుతున్నారే! వీరికి ఉన్న సదుపాయాల్లో కొన్నైనా నా వారికి లేవే! అటువంటప్పుడు నాకెందుకీ హంసతూలికా తల్పాలు? ఎవరిక్కావాలి ఈ ధనం, కీర్తిప్రతిష్ఠ? అమ్మా జగజ్జననీ, నేనివేవీ అడగలేదే? నాకివేవీ వద్దు. నా దేశ ప్రజల అన్నార్తినీ, జ్ఞానార్తినీ తీర్చు. వారిని మేల్కొలుపు. వారిని మనుష్యులను చేసి తమ కాళ్ళపై తాము నిలబడి తామూ ఏదైనా సాధించగలమనే విశ్వాసాన్ని కలగజేయి అంటూ రోదిస్తూ నేలకువాలి అక్కడే శయనించారు.

ఆ తరవాత స్వామీజీ ఇంగ్లాండు దేశానికి వెళ్ళి రెండునెలలు విజయవంతంగా ధర్మప్రచారం చేశారు. మళ్ళీ న్యూయార్కు తిరిగి వచ్చారు. మళ్ళీ అక్కడ చేసిన ప్రసంగాలు 'కర్మయోగం', 'రాజయోగం', 'భక్తియోగం' అనే పేర్లతో పుస్తకరూపంలోకి వచ్చాయి. అవన్నీ వెంటనే చాలా పేరు తెచ్చుకొని అధికసంఖ్యలో అమ్ముడుపోయాయి. అమెరికా భారతదేశాల మధ్య ప్రాక్పశ్చిమ సంబంధాలు పెరిగి, భారతదేశం పశ్చిమ దేశాలకు ధర్మము ఆధ్యాత్మికత బోధించాలని వాళ్లు భారతీయులకు సైన్సు, సాంకేతికత, సంస్థలుగా కలిసి ఒకటిగా పనిచేయడం వంటివి నేర్పించాలనేది ఆయన కల.

తరువాత స్వామీజీ జర్మనీ వెళ్ళారు. అక్కడ జర్మన్ సంస్కృతపండితుడైన ప్రొఫెసర్ డుసెన్‌ని కలిశారు. వారిద్దరూ ఎన్నో విషయాలపై చర్చించుకున్నారు. ఎన్నోచోట్లకి కలిసి వెళ్ళడం జరిగింది. మళ్ళీ లండన్ వచ్చి ఉపన్యాసాలివ్వడంలో మునిగిపోయారు స్వామీజీ.

### భారతదేశం స్వామీజీకి బ్రహ్మరథం పట్టడం

ఇక స్వామీజీ భారతదేశానికి తిరిగి రావాలని నిశ్చయించుకున్నారు. నెపల్స్ అనే ఊరి నుండీ స్వామీజీ తన శిష్యులు గుడ్‌విన్, సెవియర్ దంపతులతో భారతదేశానికి తిరిగి ప్రమాణమయ్యారు....

వచ్చేముందు ఒక ఆంగ్లేయమిత్రుడు స్వామీజీని ఇలా అడిగాడు. "స్వామీ! నాలుగేళ్ళు ఎన్నో భోగాలతో నిండిన పాశ్చాత్యంలో గడిపి పేదరికంతో ఉన్న భారతదేశానికి వెళ్తున్నారు ఏమనిపిస్తోంది?" స్వామీజీ ఇలా సమాధానమిచ్చారు. "నేనిక్కడికి రాకముందు నా దేశాన్ని ప్రేమించేవాడిని. ఇప్పుడు నా దేశపు గాలి, నీరు, ధూళి కూడా నాకు పవిత్రమూ, పూజనీయమూ అయ్యాయి. నా మాతృదేశం ఇప్పుడొక మహాతీర్థస్థానం."



ధర్మ ప్రచారంలో స్వామి వివేకనంద

స్వామీజీ తిరిగిరావడం భారతదేశపు జవసత్వాలు తిరిగి రావడమే అయింది. అప్పటికి వివేకానందస్వామి వారంటే తెలియనివారు భారతదేశంలో ఎవరూ లేరు.

1897 జనవరి 15వ తారీఖున ఓడ అప్పటి బ్రిటీషు ఇండియాలోని కొలంబో చేరింది. మళ్ళీ తన పవిత్ర భారతభూమిపై కాలుపెట్టగలుగుతున్నారని స్వామీజీ మనస్సు ఆనందంతో పొంగిపోయింది. స్వామీజీకి స్వాగతం పలకడానికి భారతదేశ ప్రజలు చేసిన స్వాగత సన్నాహాల గురించి వారికి తెలియదు. ఆయన్ని స్వాగతించడానికి అన్ని నగరాల్లోను స్వాగత కమిటీలు ఏర్పడ్డాయి. వార్తాపత్రికలు ఎన్నో సంపాదకీయాలు రాశాయి.

తర్వాత స్వామీజీ స్టీమర్ భారతదేశపు ప్రధాన భూమికి వచ్చి పంబన్ అనే గ్రామంలో దిగబోయారు. రామనాడుకి రాజైన భాస్కర సేతుపతి స్వామీజీకి ఎదురువెళ్ళి, ఆయన ముందు మోకాళ్ళపై కూర్చుని మొదట తన తలపై కాలుమోపి తరువాత భారతభూమిపై దిగమని శిరస్సువంచి ప్రార్థించాడు. స్వామీజీ అందుకు సున్నితంగా నిరాకరించారు. స్వామీజీకి సపరివారంగా సాష్టాంగ నమస్కారంచేసి స్వయంగా తన రథంలో కూర్చుండబెట్టాడు.

## కలకత్తా, ఉత్తరభారతం

1897 మే నుండీ 1898 జనవరి వరకూ స్వామీజీ ఉత్తరభారతదేశంలోని ఎన్నో నగరాలకి వెళ్ళాడు. ప్రతిచోటా స్వామీజీకి ప్రజలు ప్రేమాభిమానాలతో, పూర్ణకుంభంతో స్వాగతమిచ్చారు. దక్షిణంలోని కొలంబో నుండి ఉత్తరంలోని అల్మోరా వరకూ స్వామీజీ అంతటా భారతీయులకి తమ శక్తిసామర్థ్యాలనీ, పూర్వవైభవాన్నీ గుర్తుచేశారు. వారు ఎంత పుణ్యభూమిలో పుట్టారో, భారతదేశ సంస్కృతీ నాగరికతలు ఎంత ప్రాచీనమైనవో, ఘనమైనవో, వేలఏళ్ళు కాల పరీక్షని తట్టుకుని ఎలా జీవించి ఉన్నాయో వివరించి చెప్పారు. పాశ్చాత్యులనీ, వారి అనాధ్యాత్మికతనూ అనుకరిస్తే అధోగతి తప్పదనీ, భారతదేశం, దాని సంస్కృతీ నామరూపాల్లేకుండా పోతాయనీ, ప్రపంచానికంతటికీ ఆధ్యాత్మిక జ్ఞానభిక్ష పెట్టవలసిన భారతావనే నశిస్తే ప్రపంచంలోనే ధర్మం, భగవత్తత్వం నశిస్తుందనీ హెచ్చరించారు.

## సందేశం

స్వామి వివేకానందుడు తన సందేశాల్లో మతం విశాల దృక్పథాన్ని, విద్య ఆవశ్యకతను, స్త్రీలను గౌరవించడాన్ని, దరిద్రనారాయణుల సేవను, యువత కర్తవ్యాన్ని భారతీయాత్మతో జోడించి వివరించేవాడు. "నా భారతం అమర భారతం" అన్న పవిత్ర భావన ఆయన దేశభక్తికి అద్దం పడుతుంది. ఆయన సందేశాల్లోని కొన్ని మాటల్ని మననం చేసుకుందాం–

ఏ భూమిలో సౌకుమార్యం, ఉదారత, పవిత్రత అత్యున్నత స్థాయికి చేరుతాయో; ఏ ప్రాంతంలో ఆత్మవిచారం, తాత్వికప్రవృత్తి అధికపాళ్ళలో ప్రవర్తిల్లుతాయో అదే పుణ్యభూమి. ఆ అర్హత కల్గింది మన భారతదేశం మాత్రమే!

భారతజాతి శతాబ్దాలుగా శక్తిమంతమైన జాతి. ఐనా తనదేశం నుండి బయటికి వెళ్ళి ఇతర రాజ్యాలపై ఏనాడూ అది దండయాత్ర చేయలేదు. సంపద, అధికారం ఈ జాతికి ఎన్నడూ ఆదర్శాలు కాలేదు.

భారతీయుడెవరైనా సరే జాతి, మత తారతమ్యంలేకుండా; పేద, గొప్ప వివాదంలేకుండా; కుల వివక్షతను దరిజేరనీయకుండా అందరూ నా సహోదరులేనని ఎలుగెత్తి చాటాలి. అంతేకాదు, భారతీయ సమాజం నా బాల్యడోలిక; నా యౌవన ఉద్యాన వనం; వార్ధక్యంలో పాపహారిణియైన వారణాసి. ఆ సమాజమే నాకు స్వర్గతుల్యం. భారతదేశానికి అంతటికీ ఏది హితమో నాక్కూడా అదేహితం అని ప్రకటించు.

భారతదేశంలో రెండు గొప్ప దుష్కర్మలు సాగుతున్నాయి. ఒకటి స్త్రీజాతి అణచివేత, రెండవది బీదప్రజల పట్ల నిర్దాక్షిణ్య వైఖరి. భారతదేశానికి ఏదైనా మంచి జరగాలంటే స్త్రీజనోద్ధరణ, జనచైతన్యం ప్రధానంగా సంభవించాలి. స్త్రీలకు సముచిత గౌరవ ప్రతిపత్తి నివ్వడం వల్లనే ప్రపంచ జాతులు ఔన్నత్యాన్ని సాధించాయి. ఏదేశమైతే స్త్రీలను గౌరవించదో ఆదేశం ఉచ్ఛస్థితిని పొందలేదు.

బీదలకు ఉపాధి కల్పించాలంటే ద్రవ్యసమృద్ధి అవసరం. నాకు ఈ లోకంలో సరిపడ తిండిని ప్రసాదించలేక స్వర్గంలో నిత్యానందాన్ని సమకూర్చే భగవంతునిపై నేను విశ్వాసముంచలేను. ముందు కడుపునిండా తిండి, తర్వాతనే మతం. పేదజనానికి ఆహారమివ్వాలి. విద్యావ్యాప్తి సక్రమంగా జరగాలి. సర్వజనులకూ తగినంత ఆహారం, విస్తృతమైన జీవనోపాధి అవకాశాలు కల్పించాలి.

మనదేశంలో ప్రాచీనకాలం నుంచీ విద్యాభ్యాసం సంస్కృతభాషలో జరిగినందు వల్ల విద్యావంతులైన వారి భాషకు, వాడుక భాషకు విపరీతమైన అంతరం ఏర్పడింది. కాని బుద్ధుడు, చైతన్యప్రభు, రామకృష్ణులు, ప్రపంచాన్ని ఉద్ధరించడానికి వచ్చిన మహామహులందరూ వారివారి బోధనలను వాడుక భాషలోనే చేశారు. పాండిత్యం గొప్పదే! కాని సర్వులకు అర్థంగాని, కృతమైన గ్రాంథిక భాషలోగాక, వ్యావహారిక భాషలో కళాత్మకంగా, సహజంగా శాస్త్రపాండిత్యం సాధించాలి. విద్యా సంబంధమైన పరిశోధనలను కూడా ఇంట్లో మాట్లాడుకునే వాడుక భాషలోనే నిర్వహించాలి. విద్య సమస్త సమస్యలనూ పరిష్కరించే మార్గం కావాలి.

ఇప్పటి యువకులమీద, వారి ఆధునికతపైన నాకు పరిపూర్ణమైన విశ్వాసం ఉంది.

సాహసికులైన యువకులారా! మీకు కావలసినవి మూడే విషయాలు: అవి ప్రేమ, నిజాయితీ, సహనం. ప్రేమించలేని మానవుడు జీవన్మృతుని కింద పరిగణింపబడతాడు. నిరుపేదలను, అమాయక ప్రజలను, అణగదొక్కబడిన వారిని ప్రేమించండి; వారికొరకు వేదన చెందండి; పరితపించండి. పిరికి తనాన్ని విడనాడండి. ధైర్యంగా సమస్యలను ఎదుర్కోండి. దీన జనులకోసం శ్రమించండి. వారిని ఉద్ధరించండి. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోండి. సహనంతో వ్యవహరించడమే సత్ఫలితాలను సాధిస్తుందని మరువకండి!

ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్య వరాన్ నిబోధత!

(లేవండి! మేల్కొనండి! శ్రేష్ఠులైన ఆచార్యుల బోధనలననుసరించండి!)

**చివరిరోజులు**

1900 డిసెంబరు నెల నుండి స్వామిజీ బేలూరు మఠంలో ఉన్నారు. మఠంలో జీవనానికి కొన్ని నిర్దిష్ట నియమాలు పెట్టారు. అందరూ అవి పాటించేటట్లు చూసేవారు. స్వామీజీ రోజూ తెల్లవారుఝామున చాలాముందుగా లేచేవారు. ధ్యానం చేసుకున్నాక, తోటలో తిరుగుతూ, ఆవులను చూస్తూ భక్తులకు జరిగే వంటలని పర్యవేక్షిస్తూ ఉండేవారు స్వామీజీ.

ఆయన చాలా జంతువులను పెంచేవారు. బాఘా అనే కుక్క ఉండేది. హంసి అనే ఆడమేక ఉండేది. అలాగే ఆవులూ, ఒక గొఱ్ఱె, కొన్ని బాతులు, ఒక జింక, ఒక కొంగ, 'మాత్రు' అనే ఒక మేకపిల్ల మొదలయినవి ఉండేవి. స్వామీజీ వీటన్నిటినీ ప్రేమించేవారు. ఆ జంతువులు కూడా స్వామీజీని బాగా ప్రేమించేవి. మాత్రు అయితే స్వామీజీ ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్ళేది.

## శరీరాన్ని త్యజించడం

వివేకానందస్వామి వారి ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది.

వివేకానందస్వామి జీవితంలో చివరి నెలలు బేలూరు మఠంలో గడిపారు. తన తుదిశ్వాస వరకూ ప్రజలని చైతన్యవంతులని చేసి తమ కాళ్ళమీద తాము నుంచోగలిగేట్లు చేయడంకోసం శ్రమించారాయన. ప్రజలందరినీ స్వామీజీ అమితంగా ప్రేమించేవారు.

స్వామీజీ ఎక్కువకాలం జీవించదలుచుకోలేదు. ఎన్నోసార్లు తన శిష్యులకీ, స్నేహితులకీ తాను త్వరలో ఈ ప్రపంచాన్ని వదిలివేయబోతున్నట్లు పరోక్షంగా చెప్పారు. కానీ ఎవరూ ఇంత త్వరగా ఆ ముహూర్తం వస్తుందని అనుకోలేదు. "నేను నలభై చూడను అని" జోసెఫిన్ మక్లౌడ్ అనే స్నేహితురాలితో స్వామీజీ స్పష్టంగా చెప్పారు. తన అంతిమ దినానికి వారంరోజులముందు ఒక శిష్యుణ్ణి పిలిపించుకుని, పంచాంగం చదవమన్నారు.

అది 1902, జులై 4వ రోజు. ఆ రోజు స్వామి పొద్దున శ్రీరామకృష్ణుల మందిరానికి వెళ్ళి తన అలవాటుకి భిన్నంగా అన్ని కిటికీలు తలుపులూ మూసుకుని మూడుగంటలసేపు గాఢ ధ్యానంలో గడిపారు. తర్వాత దినచర్యకు భిన్నంగా సన్యాసులందరితో కలిసి భోజనం చేశారు.

సంధ్యాసమయం. శ్రీరామకృష్ణులకి ఆరాత్రిక సేవ జరిగేందుకు ముందు శంఖం పూరించడం జరిగింది. స్వామీజీ తన గదికి వెళ్ళి గంగకు అభిముఖంగా కూర్చుని ధ్యానముద్ర ధరించారు. ఒక గంట తర్వాత ఆయన మంచంపై పడుకున్నారు. రెండుసార్లు దీర్ఘంగా ఊపిరి పీల్చారు. పరీక్షిస్తే స్వామి దేహంలో ఊపిరి లేదని గ్రహించారు. స్వామీజీ ఇక శాశ్వతంగా ఆ శరీరాన్ని వదలివేశారు.

స్వామీజీ తన జీవితాంతం ఎంతో శ్రమపడి కష్టపడి పనిచేశారు. ఆయన భౌతిక జీవితం ముగిసింది. కాని ఆయన పని కొనసాగుతూనే ఉంది. "లేవండి! మేల్కొనండి! గమ్యం చేరేవరకు విశ్రమించకండి!" అని తన దేశ ప్రజలకి పిలుపునిచ్చారు. వారంతా ఆ పిలుపు విన్నారు. భరతమాత మేల్కాంచింది. ఆయన భావజ్వాలతో మొదలైన నవభారత నిర్మాణం, దేశానికి స్వాతంత్ర్యం రావడంతోనే కాక ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.....

© SCERT not to be republished

### ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు పదిహేను వాక్యాలకు మించని సమాధానాలు రాయండి.**

1. నరేంద్రుని బాల్యం, విద్యాభ్యాసం గురించి రాయండి.
2. వివేకానందుని అమెరికా పర్యటన విశేషాలు తెల్పండి.
3. వివేకానందుడు జాతికిచ్చిన సందేశమేమి ?
4. వివేకానందుని సందేశాల ఆధారంగా ఏకపాత్రాభినయం చేయండి.